

సివిల్ హాస్పిటల్ సమీపంలో నగరపాలక సంస్థ నిర్మించిన వాణిజ్య సముదాయం

ఇష్టారాజ్యంగా దుకాణాల కేటాయింపు

- ఒకే కుటుంబంలో నలుగురు అర్హులుగా గుర్తింపు
- నగరంలో లేని ఇంటి నంబర్లతో జాబితా తయారు
- అర్హులైన వీధి వ్యాపారులకు అన్యాయం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సివిల్ హాస్పిటల్ ప్రాంతంలో నిర్మించిన బల్దియా వాణిజ్య సముదాయంలో దుకాణాల కేటాయింపులో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు విమర్శలు వస్తున్నాయి. దుకాణాలను అర్హులైన స్థానిక వీధివ్యాపారులకు కేటాయించి, మిగిలిన వాటిని బహిరంగ వేలంలో లేదా లాటరీ ద్వారా కేటాయించాల్సి ఉంది.

2024 మార్చి 1న కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తామని నగరపాలక సంస్థ ప్రకటించింది. దీంతో వీధి వ్యాపారులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. కొందరు స్థానిక వీధి వ్యాపారులు కోర్టును ఆశ్రయించడంతో దుకాణాల కేటాయింపునకు బ్రేక్ పడింది. తొమ్మిది నెలలుగా దుకాణాలను అద్దెకివ్వకుండా ఖాళీగానే ఉంచారు. కోర్టు ఆదేశాల మేరకు 52 మందిని అర్హులుగా పేర్కొంటూ అధికారులు రెండు జాబితాలను తయారు చేసి శనివారం జరిగిన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఆమోదం తీసుకున్నారు. ఈ జాబితాపై ఎలాంటి చర్చ లేకుండా పాలకవర్గం తీర్మానం చేసింది. ఒక్కో దుకాణానికి రెండు వేల రూపాయల అద్దెతో ఐదు సంవత్సరాలు ఇవ్వాలని కౌన్సిల్ తీర్మానం చేసింది. దుకాణాలకు అర్హులుగా పేర్కొంటూ కౌన్సిల్ ఆమోదం తీసుకున్న జాబితాపై విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

వీధి వ్యాపారులు కానివారికి, స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డు లేనివారికి, ఒకే కుటుంబంలోని నలుగురికి నాలుగు దుకాణాలను కేటాయించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాలు కేటాయించిన వారి ఇంటి నంబర్లు నగరంలోనే లేవని, వారికి ఎలా కేటాయిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కరీంనగర్‌లో 3-174 అనే నంబర్‌తో ఇంటి నంబరు లేదు. దుకాణాలకు అర్హులుగా పేర్కొంటూ రూపొందించిన జాబితాలో ఆ ఇంటి నంబర్ వేశారు. దీన్ని బట్టి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు దుకాణాలు కేటాయించాలని వీధివ్యాపారులు కోరుతున్నారు.

అర్హులైనవారికే బల్దియా దుకాణాలను కేటాయించాలి

కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు

బల్దియా వాణిజ్య సముదాయంలో అనర్హులకు దుకాణాలు కేటాయించారు. ఇల్లు, బంగ్లా ఉండి అసలు వ్యాపారం చేయని వారికి, ఒకే కుటుంబంలో నలుగురికి వేర్వేరు తప్పుడు ఇంటి నంబర్లతో దుకాణాలు కేటాయించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలి. ఎంతో మంది పేద వ్యాపారులు అద్దెలు చెల్లించలేక అవస్థలుపడుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాము.

ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ

ఆంధ్రజ్యోతి పరిశీలన

- అడుగడుగునా సమస్యలు
- వసతులు లేక ఇబ్బందులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత

వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. గన్నేరువరం లాంటి మూరుమూల మండలంలో పీహెచ్‌సీ లేకపోవడంతో ప్రజలు వైద్యం కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఉంది. కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌కు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మంజూరైనా ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. ఆ కేంద్రానికి కేటాయించిన సిబ్బంది కొత్తపల్లి కేంద్రంలోనే విధులు నిర్వహిస్తున్నారు. పలు కేంద్రాలకు ప్రహరీ లేకపోవడంతో విష పురుగులు ఆస్పత్రుల్లోకి వస్తున్నాయి. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి పరిశీలన'..

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



పెచ్చులూడిన సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హాల్

ఇద్దరు వైద్యులూ సెలవుల్లోనే..



తిమ్మాపూర్ పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

తిమ్మాపూర్: మండలంలోని పీహెచ్‌సీ లు, సబ్‌సెంటర్లలో సిబ్బంది కొరత ఉంది. మండల కేంద్రంలో ప్రాథమిక కేంద్రంతో పాటు మండలంలో తొమ్మిది సబ్ సెంటర్లు ఉన్నాయి. తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు, స్టాఫ్ నర్సు, సీనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ (మేల్), మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ (ఫిమేల్), స్టాఫ్ నర్స్ (ఎన్‌సీడీ), డాటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్ ఒకరు చొప్పున ఉండాలి. పీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు డాక్టర్లు సెలవులో ఉన్నారు. కొందరు సిబ్బంది డిప్యూటేషన్‌లో ఉన్నారు. గతంలో ఇక్కడ ప్రసవాలు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇద్దరు డాక్టర్లు సెలవులో ఉండడంతో గుమ్లాపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్‌ను ఇక్కడ డిప్యుటేషన్‌పై నియమించారు.. పీహెచ్‌సీ పరిధిలోని నాలుగు సబ్‌సెంటర్లకు సొంత భవనాలు ఉన్నాయి. ఐదు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

పట్టణానికి దూరంగా..

భగత్‌నగర్: కొత్తపల్లి ఆరోగ్యకేంద్రం పట్టణానికి దూరంగా ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లి నుంచి కరీంనగర్ రోడ్డుకు కిలో మీటరు దూరంలో ఉండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తపల్లి ఆరోగ్య కేంద్రానికి కొత్తపల్లి పట్టణంతో పాటు, రేకుర్తి, రామడుగు మండలంలోని వెలిచాల, కొక్కెరకుంట, రుద్రారం, అన్నారం గ్రామాల నుంచి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఆరోగ్య కేంద్ర దూరంగా ఉన్నా వ్యయ ప్రయాసాలకు ఓర్చుకుని వచ్చిన రోగులు వైద్యులతో పాటు, సిబ్బంది అందుబాటులో ఉండక పోవడం అవస్థలు పడుతున్నారు.

కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరొకరు డిప్యూటేషన్‌లో ఉన్నారు. ఉన్న వైద్యురాలు మీటింగ్‌లు, జిల్లా సమావేశాలకు వెళ్తుండడంతో రోగులకు వైద్యం అందక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఆరోగ్య కేంద్రంలో బీపీ, జనరల్ మాత్రలు కూడా అందుబాటులో ఉండడం లేదు. కొత్తపల్లి మండలంలో రెండు ఆరోగ్య కేంద్రాలకుగాను ఆసిఫ్‌నగర్ ఆరోగ్య కేంద్రం కాగితాలకే పరిమితమైంది. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది అంతా కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం నుంచే విధులు నిర్వహిస్తున్నారు.

శిథిలావస్థలో భవనం

సైదాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థలకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షం కురిస్తే ఆస్పత్రిలోకి నీరు చేరుతుంది. హాల్, బెడ్స్ వార్డు, డాక్టర్ గదితో పాటు ఇతర గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆస్పత్రిలో చేసిన వైరింగ్ సక్రమంగా లేక విద్యుత్ సమస్యల తలెత్తుతోంది.

ప్రహరీ లేక ఇబ్బందులు

ఇల్లందకుంట: మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో ప్రజలు, సిబ్బంది నానా ఇబ్బందులు పడుతు న్నారు. నిత్యం ప్రభుత్వాస్పత్రికి వందలాది మంది వైద్యం చేయించు కోవడానికి వస్తారు. మండలంలో ఐదు సబ్ సెంటర్లు ఉండగా అందులో 12మంది ఏఎన్‌ఎంలకుగాను 8మంది ఉన్నారు. మరొక నాలుగు సెంటర్లకు నలుగురు సెకండ్ ఏఎన్‌ఎంలు అవసరం ఉంది. వర్షాకాలంలో చెరువులోని నీరు ఆస్పత్రిలో మెట్ల వరకు చేరుకుంటాయి. ప్రహరీ లేకపోవడంతో విష పురుగులు ఆసుపత్రిలోకి వస్తున్నాయి.

అద్దె భవనాల్లో..

గంగాధర: మండలంలోని పల్లె దవాఖానాలు అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. గంగాధరలో పీహెచ్‌సీతో పాటు తొమ్మిది సబ్ సెంటర్లున్నాయి. గంగాధర, గర్శకుర్తి, బూరుగుపల్లి, ర్యాలపల్లి గ్రామాల్లో పక్క భవనాలుండగా మిగతా సెంటర్లని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ర్యాలపల్లి, కురి క్యాల సబ్ సెంటర్లలో వైద్యులు లేక ఏఎన్‌ఎంలే సేవలందిస్తున్నారు. గంగాధరలో ఎక్కువగా కుక్క, కోతులు, ఎలుకలు కరిచిన కేసులు ఎక్కువ వస్తున్నాయి. పల్లె దవాఖానాల్లో బీపీ, షుగర్, జ్వరానికి మాత్రమే మాత్రలు అందుబాటులో ఉంటున్నాయి. గంగాధర పీహెచ్‌సీతో పాటు గ్రామాల్లో వైద్యులు సమయపాలన పాటించడంలేదనే విమర్శలున్నాయి.



గంగాధర మండలం కురిక్యాలలో అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖానా

మిగతా 8వ పేజీలో..







దూరంగా ఉన్న కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం, ప్రహరీ లేని ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తిమ్మాపూర్ పీహెచ్‌సీలో కొన్ని రోజులుగా తొలగించకుండా ఉంచిన వ్యర్థాలు



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్, పాల్గొన్న సీపీ అభిషేక్ మొహంతి, అధికారులు

మహిళలు, పిల్లలకు 'భరోసా'

- రాష్ట్రంలో మావోయిస్టులు లేరని చెప్పలేదు...
- భరోసా సెంటర్ ప్రారంభోత్సవంలో డీజీపీ డాక్టర్ జితేందర్

బాలికలు, మహిళల భద్రత కోసం భరోసా కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నామని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కొత్తపల్లి సమీపంలో భరోసా కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు చేయూతనిందించేందుకు పోలీసుశాఖ, ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాలు మంచి ఫలితాలనిస్తుస్తున్నాయని తెలిపారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం వల్ల మెరుగైన సేవలందించ వచ్చన్నారు. - కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

7

క్రిస్మస్ సందడి షురూ



విద్యుద్దీపాలతో అలంకరించిన సీఎస్‌ఐ వెస్లీ కేథడ్రిల్ చర్చి



ముస్తాబైన క్రిస్టియన్‌కాలనీలోని చర్చి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 22: క్రిస్మస్ వేడుకలు నెల రోజుల నుంచి ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో క్రిస్మస్ సందడి మొదలైంది. విద్యుత్ బల్బులు, అలంకరణ సామగ్రి కనువిందు చేస్తున్నాయి. క్రైస్తవులు వివిధ వస్తువులను కొనుగోలు చేసి గృహాలను అలంకరించుకోవడంలో నిమగ్నమవుతున్నారు. నక్షత్రాలు 10 నుంచి 500 రూపాయల వరకు, క్రిస్మస్ ట్రీలు సైజును బట్టి 35 నుంచి 2500 రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. శుభాకాంక్షతో కూడిన తోరణాలు 25 నుంచి వంద రూపాయల వరకు అమ్ముతున్నారు. డెకరేషన్ వస్తువులు 75 నుంచి వెయ్యి రూపాయల వరకు దొరుకుతున్నాయి. క్రిస్మస్ తాత డ్రెస్ 275 నుంచి 750 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. క్రీస్తు ఫోటోలు, థర్మకోల్ షీట్లు, క్రిస్మస్ తాతల రూపాలను అమ్ముతున్నారు. పలు రకాల గిఫ్ట్‌లను 50 నుంచి 500 రూపాయల వరకు అమ్ముతున్నారు. వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు నగర వాసులు సిద్ధమవుతున్నారు. వస్తువుల ధరలు పెరిగినా కొనడానికి మక్కువ చూపుతున్నారు. గిరాకీ బాగుందని వ్యాపారులు చెబుతున్నారు.



క్రిస్మస్ ఆర్టికల్స్ కొంటున్న యువకులు

ముస్తాబైన చర్చిలు

క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా చర్చిలను ముస్తాబు చేశారు. కాంతులీనుతున్న విద్యుత్ దీపాలు, రంగుల బల్బులు, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలతో అలంకరించారు. ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు మండల, గ్రామ కేంద్రాల్లో సుమారు 315కు పైగా చర్చిలు ఉండగా జిల్లా కేంద్రం, శివారుల్లో దాదాపు 78 చర్చిలున్నాయి. కరీంనగర్‌లోని పురాతనమైన వెస్లీ కేథడ్రిల్ చర్చ్, లూర్దుమాత చర్చ్, బేతేలు చర్చ్, సెయింట్ మార్క్ చర్చ్, సెంటినరీ వెస్లీ చర్చ్‌లలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నేడు జిల్లా జూడో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మంకమ్మతోట సాయిమానేరు పాఠశాలలో జూడో సీనియర్స్ జిల్లాస్థాయి మహిళలు, పురుషుల జట్ల ఎంపిక పోటీలను సోమవారం నిర్వహిస్తున్నామని జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడారి అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలిపారు. 2010 సంవత్సరంలో జన్మించినవారు పోటీలకు అర్హులని తెలిపారు. మహిళలకు 48, 52, 57, 63, 70, 78 కేజీలలోపు, 78 కేజీలపై, పురుషులకు 60, 66, 73, 81, 90, 100 కేజీలలోపు, 100 కేజీల పై విభాగంలో పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

భగత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-2 డిపో పరిధిలోని ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కరీంనగర్-2 డిపో పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, ధర్మారం, గంగాధర మండలాల ప్రయాణీకులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకొని సమస్యలు, సలహాలు అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో విద్యుదాఘాతంతో అదే గ్రామానికి చెందిన జంగిటి నవీన్(32) మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి చిన్న నర్సయ్య అలియాస్ ఇచ్చన్న శనివారం జంతువుల వేట కోసమని గ్రామ శివారులోని మామిడి తోటకు నవీన్‌ను వెంట తీసుకెళ్లాడు. అంతకుముందే చిన్న నర్సయ్య ఎలక్ట్రిక్ తీగకు కరెంట్ షాక్ పెట్టి అక్కడ ఉంచాడు. ఆ విషయం తెలియక నవీన్ అటు వైపు వెళ్లడంతో తీగకు కాలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తన భర్త చావుకు చిన్న నర్సయ్యనే కారణమంటూ నవీన్ భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ పరిశీలించారు.

వ్యాన్ ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన గాజుల సత్యనారాయణ(50) అనే వ్యక్తి శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై వెంకట్రావునగర్ నుంచి కొత్త బస్టాండ్ వద్ద యూటర్న్ చేస్తుండగా ట్రావెలర్ వ్యాన్ ఢీకొని తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ కూతురు వివాహం ఇటీవల జరిగింది. ఆదివారం వధూవరులకు ఓడిబియ్యం కార్యక్రమం నిర్వహించాల్సి ఉండడంతో ద్విచక్రవాహనంపై సెలూన్‌కు వెళ్లి కటింగ్ చేసుకొని తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే సెలూన్ వద్ద సెల్‌ఫోన్ మరిచిపోవడంతో తీసుకొని అదేమార్గంలో ఉన్న బంధువులను పిలిచి వస్తానని చెప్పి ఇంట్లోనుంచి ద్విచక్రవాహనంపై సత్యనారాయణ వెళ్లాడు. సిరిసిల్ల కొత్తబస్టాండ్ వద్ద యూటర్న్ చేస్తుండగా కామారెడ్డి వైపు వెలుతున్న టీఎస్ 23, 1126 నంబర్ గల వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఓడిబియ్యం కార్యక్రమం జరగాల్సిన ఇంట్లో యజమాని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విషాదం అలుముకుంది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేట్లు చూస్తామని పోలీసులు హామి ఇవ్వడంతో ఆందోళన సద్దుమనిగింది. మృతుడు సత్యనారాయణకు భార్య అరుణ, కూతురు, కుమారుడు ఉన్నారు. సంఘటనపై ఇల్లంతకుంట మండలంలోని జగ్గారెడ్డిపల్లికి చెందిన విలాసాగరం వేణు అనే వ్యాన్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

మల్లాపూర్, డిసెంబరు, 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన తోట రాజం(60) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజం కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రిల్లో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ ఘటనలో ముగ్గురి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో జరిగిన పలు చోరీ ఘటనల్లో కామారెడ్డి జిల్లా కామారెడ్డి, మాచారెడ్డి, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు అర్జున్‌సింగ్, శ్రీకాంత్, గంగయ్యను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన దాసరి అజయ్‌కుమార్ తన బైక్‌ను గొల్లపల్లిలో నిలుపగా చోరీకి గురైంది. ఈ నెల 21న మండల కేంద్రంలోని రెండో బైపాస్ రోడ్డులో కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారించడంతో బైక్‌ను దొంగిలించి కామారెడ్డిలోని అర్జున్‌సింగ్‌కు అమ్మకానికి ఉంచానని అంగీకరించాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్‌లో బైక్‌లను అపహరించడంతో పాటు లచ్చవ్వ ఇంటిలో చోరీకి పాల్పడిన గొల్లపల్లి వడ్డెర కాలనీ వాసి గంగయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. వెండి, బంగారు ఆభరణాలను అమ్ముకున్నానని వెల్లడించారు. రెండు ద్విచక్రవాహనాలు, నగదు స్వాధీనపర్చుకుని అర్జున్‌సింగ్, శ్రీకాంత్, గంగయ్యను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన ఒకరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యంను అక్రమంగా విక్రయించేందుకు నిల్వ చేసిన సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన అనంతుల శ్రీనివాస్‌ను ఆదివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యంను ఇంట్లో అక్రమంగా నిల్వచేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్న టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా 94 క్వింటాళ్లలో 39.54క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.

ఉపాధి కోసం.. ఊరూరా సంచారం

● ధనుర్మాసంలో గంగిరెద్దులవారి సందడి
● బసవన్నల విన్యాసాలు ● సంక్రాంతి వరకు పర్యటనలు

ధనుర్మాసంలో బసవన్నల సందడి ఎక్కువగా కనిపిస్తుంది. గంగిరెద్దుల వాళ్లు జీవనోపాధి వెతుక్కుంటూ ఊరూరా తిరుగుతారు. బసవన్నలను ఆడిస్తూ జనం ఇచ్చే డబ్బులు, ధాన్యం తీసుకుంటారు. బసవన్నల విన్యాసాలతో చిన్నాపెద్దను అలరిస్తారు. ఇలా ఏటా ఆరు నెలలపాటు గ్రామాల్లో సంచారం చేస్తూ మిగతా సమయాల్లో తమకున్న కొద్దిపాటి వ్యవసాయంతో కాలం వెల్లదీస్తారు. ఇంతకుముందులా జనం ఆదరణ లేకపోయినా.. బసవన్నల పోషణ భారమైనా కొంతమంది సంప్రదాయంగా వస్తున్న వృత్తినే అనుసరిస్తూ వస్తున్నారు.





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ధనుర్మాసంలో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తూ తెచ్చే కాంతులతో పల్లెలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఈ సమయంలో గంగిరెద్దుల వాళ్ల నాదస్వరంతో పాడే పాటలు, తబలా వాద్యం రంగురంగుల దుస్తులతో బసవన్నలకు చేసే అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. విన్యాసాలతో చిన్న పిల్లలు, పెద్దలను అలరించే గంగిరెద్దులు సంక్రాంతి పండుగకు ప్రత్యేక శోభను తెస్తాయి.

ముఖ్యంగా సంక్రాంతి పండుగకు రైతుల కష్టం ఇంటికి చేరుతుంది. ధాన్య రాశులతో పల్లెల్లో ఇళ్ల వద్ద సందడి కనిపిస్తుంది. ధనుర్మాసం ప్రారంభంతోనే గంగిరెద్దుల వారు కూడా ఉపాధి వెతుక్కుంటూ బయల్దేరుతారు. మూడు నాలుగు కుటుంబాలు కలిసి గ్రామానికి చేరుకుంటాయి. ఊరి పెద్దను కలిసి ఇంటింటికీ తిరుగుతారు. ఆరు నెలల పాటు బసవన్నలతో పల్లెపల్లె తిరుగుతారు. గంగిరెద్దుల విన్యాసాలు చేయిస్తారు. చిన్నాపెద్దను అలరిస్తారు. ఇలా ప్రదర్శనిలిచ్చి ఆ ఊరు జనం ఇచ్చే ధాన్యం, డబ్బులు, పాత దుస్తులు తీసుకెళ్తారు.

ప్రత్యేక అలంకరణ

బసవన్నలను రకరకాల దుస్తులతో అలంకరిస్తారు. గంగిరెద్దుల వారు కూడా సన్నాయి, బూర, డోలు, చేతిలో కంచుతో చేసిన చిన్న చేగుంట, నెత్తిన రంగుల తలగుడ్డా, మూతి మీద కోరమీసాలు, చెవులకు కమ్మల జోడు, నల్లకోటు, భుజం మీద కండువా, చేతికి వెండి మురుగులు, నోసట నామాలతో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తారు. బసవన్న నోటిలో తమ మెడను ఇరికించి చూపిస్తారు. వాయిద్యానికి అనుకూలంగా గజ్జెలతో బసవన్న కూడా నృత్యం చేస్తాడు. గంగిరెద్దుతోపాటు గొర్రె పొట్టేలుతో కూడా రకరకాల విన్యాసాలు చేయిస్తారు.

గంగిరెద్దులవారి జీవన శైలి

గంగిరెద్దుల వాళ్లలో మగవాళ్లు ఆరు నెలల పాటు పల్లెల్లో సంచారం చేస్తూ బసవన్నను ఆడిస్తారు. ఈ సమయంలో మహిళలు దువ్వెలను, పిన్నీసులు, పౌడర్లు వంటి అలంకార సామగ్రిని గంపలో వేసుకొని గ్రామాల్లో తిరిగి విక్రయిస్తారు. మిగతా ఆరునెలలపాటు తమకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయం ఇతర పనులు చేసుకుంటూ బసవన్నల పోషణను చూసు కుంటారు. గంగిరెద్దుల వారు పెద్దగా ఆర్భాటాలను పట్టించుకోరు. వారి వివాహాలు చిన్న వయస్సుల్లో జరుగుతుంటాయి. ముఖ్యంగా మేన కోడలును పెళ్లి చేసుకుంటారు. బతకడానికి అవకాశం ఉంటే పిల్లను ఇవ్వడానికి వెనుకాడరు. కట్నంగా కుక్కలు, గంగిరెద్దులను ఇచ్చుకుంటారు.

ప్రతీ గ్రామం తిరుగుతాం

పర్శరాములు

గంగిరెద్దులతో ప్రతీ గ్రామం తిరుగుతాం. పెద్ద వాళ్లను కలుస్తూ ధాన్యాన్ని సేకరించుకుంటాం. ఒకప్పుడు ఆరు నెలలపాటు సంచారం చేసేవాళ్లం. ఇప్పుడు ఆదరణ కరువైంది. ధనుర్మాసంలో నెల రోజులపాటు తిరుగుతున్నాం. ఊరూరా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.



ఆటను కాపాడుకుంటున్నాం

నాంపల్లి

ప్రతీ గ్రామంలో పెద్ద మనుషులు, సర్పంచులను కలిసి గంగిరెద్దుల ఆటను ఏర్పాటు చేసుకుంటాం. గంగిరెద్దుల ఆటను చూసి ధాన్యం, డబ్బులు ఇస్తారు. గతంలోలా ఇప్పుడు గంగిరెద్దుల ఆటను చూడడం లేదు. ప్రతీ సంవత్సరం సంచారం చేస్తూ ఆటను కాపాడుకుంటున్నాం.



వస్తువులు అమ్ముకుంటాం

గంగ రాజవ్వ

మా మగవాళ్లు గంగిరెద్దులతో ఊళ్లోకి వెళ్తే మేము దువ్వెనలు, కాటిక డబ్బాలు, ఇతర వస్తువులు అమ్ముకుంటాం. ఊరూరు తిరుగుతాం. గతంలోలా ఎవరూ కొనడం లేదు. బతుకు భారంగా ఉంది. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.



అటవీ భూముల ఆక్రమణకు యత్నం

- అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆత్మకూర్ గ్రామస్థులు



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని అటవీ భూముల ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. గ్రామస్థులు చదును చేసిన అటవీ భూమిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. అటవీ భూమి చుట్టున్న పాటిమీదతండా గ్రామానికి సంబంధించిన వారితో పాటు ఇతర గ్రామస్థులు వందల ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని గ్రామస్థులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కొన్ని రోజుల నుంచి తాము ఫిర్యాదులు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొన్నిరోజుల నుంచి సుమారు వంద ఎకాల వరకు అటవీ భూమిలో ఉన్న చెట్లను తొలగించి సాగుకు చదును చేస్తున్నారని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళన బాట పట్టామన్నారు. అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుని అడవులను కాపాడాలని గ్రామస్థులు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలపడంతో గ్రామస్థులు అక్కడి నుంచి తిరిగి వెళ్లారు.

పొలాసలో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

జగిత్యాలరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ ఇంటికి మంటలు అంటుకొని దగ్ధమై భారీగా నష్టం వాటిల్లింది. పొలాస గ్రామానికి చెందిన ఎడెల్లి గంగారాజం కుటుంబసభ్యులు గొల్లపల్లి మండలం మల్లన్నపేటలోని మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ సమయంలోనే ఘటన చోటు చేసుకుంది. ఇంట్లో దేవుడి దగ్గర పెట్టిన దీపం నుంచి పక్కనే ఉన్న టవల్‌కు మంటలు అంటుకుని ప్రమాదం జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీపం కారణంగా ప్రమాదం జరిగిందా.. లేదా షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిందా తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరులేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మానకొండూర్ మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన మామిడి రంగస్వామి టీఎస్02యూసీ7303 అనే ట్రాక్టర్, టీఎస్02 యూసీ7341 అనే ట్రాలీలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25 నుంచి 28 వకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, జిబీమా సాహేబ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎడ్ల రమేష్, నాయకులు జి తిరుపతినాయక్, గజ్జల శ్రీకాంత్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్, పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

గోదావరిఖని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలేలను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాసిపేట లింగయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో పూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాసిపేట లింగయ్య మాట్లాడుతూ చదువు ఒక్కటే జ్ఞానాన్ని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే భారత ప్రజలకు రక్షణ కవచంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు పులి మోహన్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, న్యాతరి రాయమల్లు, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, బత్తుల శంకర్, ఇరుగురాల కృష్ణయ్య పాల్గొన్నారు.

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

ధర్మపురి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్ల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్‌ప్రకాశసింగ్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసి శవాన్ని కాల్చి వేసిన బూడిద, ఎముకలను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆదివారం పరిశీలించారు. రాహుల్‌ప్రకాశ్‌సింగ్‌ను మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన నేరేళ్ల గోపాల్, నేరేళ్ల గ్రామానికి చెందిన గండికోట శేఖర్ బండరాయితో కొట్టి చంపి శవాన్ని కాల్చి బూడిద చేశారు. ఆదివారం కాలిన బూడిద, ఎముకలను పోలీసులు సేకరించారు కొన్ని ఆధారాలు సేకరించి పక్కటెముకలు, వెన్నెముక భాగాలను సేకరించి హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. వైద్యాధికారి శ్రీనివాస్ నేతృత్వంలో పోస్ట్‌మార్టం చేసి బూడిద, ఎముకలను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. హత్య కేసులో ఇద్దరిని పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ధర్మపురి సీఐ రాజనర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఎముకలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

ఉపముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్



పెద్దపూర్ గురుకుల పాఠశాల

● గురుకులాల్లో కానరాని కలెక్టర్, డీఎంహెచ్‌వో రాత్రి బస
● మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలు అసలే లేవు..
● ఇంటర్, పది తరగతులు మినహా ఇతర విద్యార్థులు ఇంటికి..

జగిత్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'పెద్దాపూర్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శనకు వచ్చాను.. ఇక నుంచి గురుకుల పాఠశాలలో నెలలో ఒక రోజు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని నిర్ణయించాము... ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు నెలలో ఒక రోజు ఒక గురుకుల పాఠశాలలో రాత్రి బస చేయాలి' ఇవి ఈ యేడాది ఆగస్టు 13వ తేదీన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురై మృతి చెందిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించి న సందర్భంగా అన్న మాటలు..

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలు కార్యరూపం దాల్చలేదు. జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు హామీలు, సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆయన పర్యటన జరిగి నాలుగు నెలల గడిచినప్పటికీ గడుస్తున్నా ఆ ఆదేశాలు మాత్రం అమలు కావడం లేదు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్స్, టీచర్స్, పారామెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నెలలో ఒకసారి కలెక్టర్, డీఎంహెచ్‌వో ఒక గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో రాత్రి బసచేస్తారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గడిచిన నాలుగు నెలల్లో జిల్లాలోని ఏ ఒక్క గురుకుల పాఠశాలలో అధికారుల రాత్రి బస, ఎమ్మెల్యేలు, మంత్రుల గురుకుల పాఠశాల సందర్శన జరగకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంతో విద్యార్థుల అస్వస్థతకు గురవుతున్న, పాముకాటు అనుమానాల వంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పిచ్చిమొక్కలు తొలగించడం, చెత్తాచెదారం ఏరివేయడం, చిన్నచిన్న రిపేర్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అధికారులు కొద్దిరోజులు హడావుడి చేసి తరువాత పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పాఠశాల ఆవరణలో కొత్తగా నిర్మించిన భవనంలోకి తరగతులు, వసతిని మార్చినా శిథిలావస్థలో ఉన్న గదులను తొలగించలేదు.

పాఠశాలలో పారామెడికల్ సిబ్బందిని ఒకరిని నియమించినప్పటికీ సంబంధిత ఉద్యోగికి విద్యార్థుల వసతికి దూరంగా ఉన్న ఓపాత గదిని కేటాయించడంతో రాత్రి వేళలో అందుబాటులో ఉండడం లేదనే విమర్శలున్నాయి. విషపురుగులు, పాములు సంచరించే ప్రమాదమున్న ప్రాంతాలను దాటుకుంటూ సంబంధిత పారామెడికల్ ఉద్యోగి ఉండే గది వద్దకు వెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● చుట్టు పక్కల ప్రాంతాల్లో పంట పొలాలు..

పెద్దాపూర్ గురుకుల పాఠశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో పంట పొలాలు ఉండడంతో విష పురుగులు, పాములు అక్కడి నుంచి అప్పుడప్పుడు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రతీయేటా వరి కొయ్యలను తగులబెట్టినప్పుడు కానీ, పంటలకు విపరీతంగా మందులను పిచికారి చేసినప్పుడు కానీ విషపురుగులు ఇతర ప్రాంతాలకు వెళ్లే వీలుంది. ప్రతీ యేటా చుట్టు పక్కల గల వ్యవసాయం చేసుకునే రైతులతో గురుకులపాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు అవగాహన సమావేశం ఏర్పాటు చేస్తుండేవారని, యేడాదిన్నరగా ఎలాంటి సమావేశాలు జరగడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఈనెల 19వ తేదీన రాత్రి ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. పాఠశాలలో రాత్రి సమయంలో బోండాలు అల్పాహారంగా అందించడంతో అవి తిన్న అనంతరం ఓ విద్యార్థి వాంతులు, మరో ఇద్దరు విద్యార్థులు కడుపునొప్పితో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించారని, ప్రస్తుతం విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఈ యేడాది జూలై 26వ తేదీన పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న రాజారపు గణాదిత్య తీవ్రఅస్వస్థతకు గురయి మృతి చెందాడు. పాముకాటు కారణంగా గణాదిత్య మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. తల్లి రాజారాపు లావణ్య, తండ్రి మహేశ్ పేదతరగతికి చెందిన వారు. వీరి పెద్దకుమారుడు పుట్టిన మూడు రోజులకు అనారోగ్యంతో మృతి చెందాడు. రెండో కుమారుడు గణాదిత్య పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటూ పాముకాటుకు గురై మృతి చెందాడు. మూడో కుమారుడు రవికుమార్ తన మూడేళ్ల వయస్సులో తీవ్ర జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. ముగ్గురు కొడుకులను కన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ముగ్గురు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన వర్ణనాతీతంగా మారింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ ప్రకారం తండ్రి మహేశ్‌కు కోరుట్ల

● అంతంత మాత్రంగానే సాయం..

మండలం కల్లూరు మోడల్ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై అటెండర్ ఉద్యోగం ఇచ్చారు. కానీ రెండున్నర నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు వేతనం చెల్లించకపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. అద్దె ఇంట్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇంటి కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన్పటికీ ఆదిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదు. గణాదిత్య మృతిచెంది సుమారు నాలుగున్నర నెలలుగా గడుస్తున్నప్పటికీ పోస్టుమార్టం రిపోర్టును అధికారులు ఇవ్వడం లేదు. ప్రతీనిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని, పోస్టుమార్టం రిపోర్టు ఇవ్వడం లేదని గణాదిత్య తల్లి లావణ్య వాపోతోంది. తమ కుమారుడు ఏ కారణంగా మృతి చెందాడో..పోస్టుమార్టం రిపోర్టులో తెలిసే వీలుంటుందని, అధికారులు రిపోర్టు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తోంది. ఇప్పటికైనా సర్కారు కనికరించి ఇందిరమ్మ ఇల్లు, తండ్రి మహేశ్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, పోస్టుమార్టం రిపోర్టు ఇప్పించాలని లావణ్య వేడుకుంటోంది.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తెల్లవారు జామునే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరిండెంట్ తిరుపతిరావు, ఆలయ ఇన్స్పెక్టర్ రాజేందర్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొండగట్టులో భక్తుల సందడి




అంజన్న ఆలయంలో క్యూలో వస్తున్న భక్తులు


మల్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారంతపు సెలవు దినం కావడంతో దూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు ఇతర అధికారులు పర్యవేక్షించారు

మల్లెగుట్టపై మల్లన్న భక్తుల కోలాహలం

మల్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని మల్లెగుట్టపై ఆదివారం సట్టి సందడి నెలకొంది. వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు మల్లెగుట్ట మల్లన్న సన్నిధిలో పట్నాలు, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. నూతనంగా మెట్లదారి అందుబాటులోకి రావడంతో ఇటీవల భక్తుల రాక గణనీయంగా పెరిగినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



సిరుల తల్లి... సింగరేణి ఒడిలో మరో వసంతం చేరనున్నది. బొగ్గు ఉత్పత్తితో మొదలైన తన జీవన గమనంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నది. ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ క్రమంగా తన మార్గాన్ని సుగమం చేసుకున్నది. కన్నబిడ్డల్లాంటి కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను తన భుజస్కంధాలపై మోస్తోంది. మూడు తరాల వారికి విద్య, వైద్యం, సంక్షేమాన్ని అందిస్తోంది. మానవ పురోగతికి కీలకమైన విద్యుత్ తయారీలో కొత్త అధ్యాయాలను లిఖిస్తోంది.'సిరుల తల్లి' సింగరేణి సంస్థ సోమవారం తన 136వ పుట్టిన రోజు వేడుకను జరుపుకోనున్నది.



సిరుల తల్లి ఒడిలో.. మరో వసంతం

- బహుళ రంగాలకు విస్తరించిన సింగరేణి
- ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు
- రూ.35వేల కోట్ల వార్షిక టర్నోవర్
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

గోదావరిఖని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తయారీకి మూల ఇందనమైన బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి రారాజుగా నిలుస్తోంది. ఏటా 70మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నది. దశాబ్దం క్రితమే విద్యుత్ రంగంలో ప్రవేశించిన సింగరేణి థర్మల్, సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో కూడా ముందుకు సాగుతున్నది. సంపడ్ స్టోరేజీ ప్లాంట్ల సాంకేతికతను తీసుకువచ్చి విద్యుత్‌ను నిల్వచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. విద్యుత్, బొగ్గును ఆధారం చేసుకుని హైడ్రోజన్, మిథనాల్ వంటి ఇంధనాల తయారీకి సంసిద్ధమవుతున్నది.

ఇది సింగరేణిలో విప్లవాత్మక మార్పు. వం దేళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి దేశంలో బొగ్గు పరిశ్రమలకు సాంకేతిక, సామాజిక దార్శనీకతను అందిస్తున్నది. రాష్ట్రంలోనే కాకుండా ఒడిశాలో కూడా బొగ్గు బ్లాకులను తీసుకుని ఉత్పత్తికి సిద్ధమైంది. ఒడిశాలో కూడా విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి సింగరేణి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది.

ప్రభుత్వాలకు ఆర్థిక దన్నుగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి ఆర్థిక దన్నుగా నిలుస్తోంది. జీఎస్టీ, కోల్ సేస్ తదితర రకాల పన్నుల రూపాల్లో ఏటా రూ.7వేల కోట్లు సింగరేణి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతున్నాయి. 49శాతం కేంద్ర ప్రభుత్వం, 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా దామాషాలో అంటే సుమారు 3700కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి, 3300కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ప్రతి ఏటా సింగరేణి చెల్లిస్తోంది. అంతేకాకుండా సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి సంవత్సరం రూ.600 కోట్లను కోల్‌బెల్ట్ ప్రభావిత ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తున్నది. వందల కోట్ల రూపాయలతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నది.

ఇలా ప్రభుత్వాలు, ప్రాంతాలకు ఉపయోగపడుతున్న సింగరేణి కార్మికులకు కూడా లాభాల్లో 33శాతం వాటా చెల్లిస్తున్నది. బోనస్‌లు, లాభాల వాటాలు, సరాసరిగా రూ.500 కోట్ల నుంచి సుమారు రూ.700 కోట్లు కార్మికులకు వేత నాలు కాకుండా పంచి పెడుతున్నది. ప్రతి సంవత్సరం రూ.35వేలకోట్ల టోర్నవర్‌తో నడుస్తున్న సింగరేణి కాలరీస్ సంస్థ తాను ప్రభుత్వాలకు చెల్లించే పన్నులు కాకుండా సంస్థ లాభాలపై ఆదాయ పన్ను, 40వేల మంది కార్మికుల వేతనాల మీద ఆదాయ పన్ను, జీఎస్‌టీల రూపంలో వందల కోట్లు పరోక్షంగా ప్రభుత్వాలకు చేరుతున్నాయి.

కాంట్రాక్టు కార్మికులకూ అండగా..

సింగరేణి సంస్థ 40వేల మంది కార్మికులకు ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఉపాధి కల్పిస్తుండగా, 30వేల మంది కాంట్రాక్టు కార్మికులను కూడా ఆదరిస్తున్నది. కార్మికుని కుటుంబానికి, పిల్లలకు, పెళ్లి చేసుకుని వెళ్లిన ఆడపిల్లలకు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం తన ఖర్చుతోనే భరిస్తున్నది. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే కోటి రూపాయలు పరిహారంగా ఇస్తున్నది. అనారోగ్యంతో కార్మికుడు మెడికల్ అన్‌ఫిట్ అయితే వారసులకు ఉద్యోగం కల్పించి ఆ కుటుంబంలో ధైర్యాన్ని నింపుతున్నది. ఇలా వివిధ రంగాల్లో సింగరేణి అభివృద్ధి చెందుతూ, రాష్ట్ర ప్రగతికి దోహదపడడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నది.



కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోని శ్రీకాలభైరవ స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో కాలభైరవాష్టమి సందర్భంగా ప్రదోష పూజ అనంతరం పంచామృతాలతో అభిషేకం చేశారు. అష్టమి రోజున కాలభైరవ స్వామి వారికి పూజలు నిర్వహిస్తే మంచి శకునాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నమిలకొండ ఉమేష్, గోపన్నగారి చందు, గర్షకుర్తి శ్రీదర్ తదితరుల ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వడుకాపూర్ విద్యార్థిని ఎంపిక



జన్వితతో ఉపాధ్యాయులు

జూలపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాట జన్విత జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎలగం మహేందర్ తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న జన్విత పెద్దపల్లిలో ఈనెల 14న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23,24,25 తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీల్లో పాల్గొననున్నట్లు మహేందర్ తెలిపారు. జన్వితను ప్రధానోపాధ్యాయుడు రమేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీల విజేత కరీంనగర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలబాలికల విభాగాల్లో విజేతగా కరీంనగర్ జట్లు నిలిచాయి. కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహిం చారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో సిరిసిల్ల జట్టు, బాలికల విభాగంలో జగిత్యాల జట్టు ద్వితీయ స్థానాల ను సాధించాయి. జిల్లా యువజన క్రీడాధికారి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు, డైరెక్టర్ పొల్సాని శిరీషలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, పెటా సంఘం అధ్యక్షులు ఎ శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో సంఘ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, పీడీలు బాబు శ్రీనివాస్, ఎ శ్రీనివాస్, తిరుమలేశ్, శ్రీనివాస్, కోచ్ మూల వెంకటేశ్, ప్రేమ్, శ్రీధర్, అశోక్, వీర్‌పాల్, అమర్‌సాయి, దుర్గరాజు, శివాజీ, రాజు, రమేశ్, హరికృష్ణ పాల్గొన్నారు.



కరీంనగర్ బాలికల జట్టుతో అతిథులు

కల్వకుంట్ల కుటుంబానికి కౌశిక్‌రెడ్డి దాసోహం: ఎమ్మెల్సీ

జమ్మికుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కుటుంబానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాసోహం అయ్యాడని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. జమ్మికుంటలో ఇటీవల మృత్యువాత పడిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గ సమస్యలపై చర్చించేందుకు స్పీకర్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సమయం ఇస్తే దాన్ని పక్కన పెట్టి, కేటీఆర్‌కు వత్తాసు పలుకుతూ స్పీకర్‌పై ఫ్లకార్డులు విసరడం సిగ్గుచేటన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాసోహం అయ్యాడన్నారు. ఎన్నికల సమయంలో ఇంది రానగర్-శాలపల్లి గ్రామాల మధ్య బీఆర్ఎస్ మీటింగ్‌కు వస్తూ ఇద్దరు రోడ్డుప్రమాదంలో మృతి చెందారని, ఆ సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఇస్తానని చెప్పిన కౌశిక్‌రెడ్డి ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నికలకు ముందు దళితబంధు రెండోవిడత ఆపింది కౌశిక్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ

ధర్మపురి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని ధర్మపురి క్షేత్రానికి తరలివచ్చారు. అనంతరం గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గ డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తిపాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన అనేక మంది భక్తులు స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రైఫిల్ షూటింగ్ పోటీల్లో విద్యార్థినికి పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారిణి కె వర్షిత పతకం సాధించింది. జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న వర్షిత ఎయిర్ రైఫిల్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి ఐదో స్థానంతో పతకం సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిని కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, కరీంనగర్ జిల్లా రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్‌రావు, కె ప్రసాద్, కెఎస్ రత్నాకర్ అభినందించారు.

మహిళలు, పిల్లలకు భరోసా

- రాష్ట్రంలో మావోయిస్టులు లేరని చెప్పలేదు
- భరోసా సెంటర్ ప్రారంభోత్సవంలో డీజీపీ డాక్టర్ జితేందర్





భరోసా కేంద్రంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్, సిబ్బందితో మాట్లాడుతున్న డీజీపీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భరోసా కేంద్రంతో బాలికలకు, మహిళలకు మరింత భద్రత కలుగుతుందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా పోలీసు, వైద్య, న్యాయసేవలు, మానసిక ప్రోత్సాహం ఒకే గూడు కిందకు వస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరితో కలిసి డీజీపీ ప్రారంభించారు. డీజీపీకి కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి పూల మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీపీ భరోసా సెంటర్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం భరోసా సెంటర్‌లో వివిధ విభాగాలు బాధితులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో భరోసా సెంటర్‌ను వెయ్యి గజాల స్థలంలో అన్ని వసతులతో అద్భుతంగా నిర్మించామన్నారు. భరోసా కేంద్రాల ఏర్పాటు కేవలం తెలంగాణలోనే ఉందని, సుప్రీంకోర్టు బృందం కూడా భరోసా కేంద్రాన్ని పరిశీలించి అభినందించిందన్నారు. ఇతర రాష్ట్ర పోలీసులు ఈ భరోసా కేంద్రాలను సందర్శిస్తున్నారని అన్నారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, సురక్షిత వాతావరణంలో చేయూత అందించేందుకే రాష్ట్ర పోలీసుశాఖ, ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాలు మంచి ఫలితాలనిస్తున్నాయని అన్నారు. భరోసా కేంద్రం ద్వారా పోక్సో కేసుల బారిన పడిన బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు ఎఫ్ఐఆర్ నుంచి మొదలుకొని కోర్టుల్లో శిక్షలు పడే వరకు బాసటగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 27 భరోసా కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. భరోసా సెంటర్లలో లీగల్ ఎక్స్‌పర్ట్స్, వైద్యులు, కౌన్సెలింగ్ టీం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. భవిష్యత్‌లో అన్ని జిల్లా కేంద్రాల్లో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని డీజీపీ తెలిపారు.

● పౌరుల భద్రతే ముఖ్యం..

కరీంనగర్ భరోసా కేంద్రంలో ఏడుగురు సిబ్బంది ఉంటారని డీజీపీ అన్నారు. ఇప్పటికే ఐదుగురిని నియమించామని మరిన్ని నియామకాలు త్వరలో చేపడుతామన్నారు. పోక్సో కేసుల్లో శిక్షల శాతం గతంలో కంటే పెరిగిందన్నారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో కరీంనగర్‌లో భరోసా సెంటర్‌ను నిర్మించామని, వారికి డీజీపీ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ చాలా బాగా పనిచేస్తుందన్నారు. పౌరుల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యం కాదని డీజీపీ స్పష్టం చేశారు. అల్లు అర్జున్ సినిమా హీరో అయినప్పటికీ ఆయన బయట సామాన్యుడేనని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకుని మెదలాలన్నారు. వ్యక్తిగతంగా తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, పౌరులందరూ బాధ్యతగా మెదలాలని సూచించారు. సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరమని, చట్టం ప్రకారం అల్లు అర్జున్‌పై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. మోహన్‌బాబుది కుటుంబ గొడవని, వారు కొంత మారారని అన్నారు. జర్నలిస్టుపై దాడి ఘటనలో మంచు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీజీపీ తెలిపారు.

రాష్ట్రంలో మావోయిస్టులు లేరని తాము చెప్పలేదని, ఈ మధ్యకాలంలో వారు రాష్ట్ర సరిహద్దులో ఇద్దరిని ఇన్‌ఫార్మర్ల పేరిట చంపారన్నారు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఫైర్ జరిగిందని డీజీపీ అన్నారు. విలేకరుల సమావేశంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి, పోలీస్ కమిషనర్ అభిషేక్‌మొహంతి, శిక్షణ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరబి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, భరోసా కేంద్రం ఇన్‌చార్జి ఏసీపీ మాధవి, సీఐ శ్రీలత, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

కరీంనగర్ పోలీస్ కమిషనర్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అస్త్ర కన్వెన్షన్ సెంటర్, ది కాప్ కెఫెలను డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన అస్త్ర ఏసీ కన్వెన్షన్ సెంటర్, ది కాప్ కెఫెలు అధికారులు, సిబ్బందికి అత్యంత తక్కువ ధరల్లో అందించేలా చర్యలు తీసుకున్నందుకుగాను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని అభినందించారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ అస్త్ర కన్వెన్షన్ సెంటర్‌ను కమిషనరేట్ కేంద్రంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించామన్నారు. ఈ హాలును సిబ్బంది కుటుంబ శుభకార్యాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి అత్యంత నాణ్యతతో కూడిన ఆహారం, స్నాక్స్ అల్పాహారం అందించేలా ది కాప్ కెఫెను నిర్మించామన్నారు. సోమవారం నుంచి ఈ రెండు కరీంనగర్ పోలీసులకు అందుబాటులోకి



ప్రభుత్వ ఉద్యోగులకు కేరాఫ్ చెంజర్ల

- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం
- ఒకే ఊరిలో 150కి పైగా ప్రభుత్వ ఉద్యోగులు

మానకొండూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాడు కరువు కాటకాలతో సతమతమై నేడు 150కి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు చిరునామాగా నిలుస్తోంది మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామం. చెంజర్ల గ్రామం గతంలో కమ్యూనిస్టులకు అడ్డాగా ఉండేది. కాకతీయ కాలువ గ్రామానికి దిగువ నుంచి వెళ్లడంతో సాగునీరు అందక పోయేది. ఎటుచూసినా బీడు భూములే కనిపించేవి. గ్రామస్థులు పనులు లేక భీవండి, ముంబాయి లాంటి ప్రాంతాలకు వలస వెళ్లేవారు.

చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని..

తరాలు మారాయి.. చదువుతోనే భవిష్యత్తు బాగుంటుందని నమ్మిన చెంజర్ల యువత పట్టుదలతో చదివారు. 2006 డీఎస్సీలో గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించారు. అంతే వారి కుటుంబాల పరిస్థితి మారి పోయింది. వారిని స్ఫూర్తిగా తీసుకుని కొత్త తరానికి చెందిన వారు చదువుపై దృష్టి సారించారు. ఏ నోటిఫికేషన్ వెలువడినా ఉద్యోగాలు సాధించిన వారి సూచనలతో ప్రిపేర్ కావడం ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామంలో 150 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు బొల్లబత్తుల ఆంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేవారిని ప్రోత్సహించారు. 2012 డీఎస్సీలో ఈ గ్రామానికి చెందిన 18 మంది యువకులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈ గ్రామానికి చెందిన వారు 70 మందికి పైగా ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తున్నారు. మరో 80 మంది వివిధ రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే..

బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్



పట్టుదల ఉంటే ఏదైన సాధించవచ్చు. పట్టుదలతో చదవి 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. తర్వాత డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయాను. ఇటీవల ప్రకటించి జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యాను.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాను..

సుదగోని స్వప్న, డిగ్రీ లెక్చరర్



మాది వ్యవసాయ కుటుంబం.. తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో పట్టుదలతో చదివాను. 2016లో కరీంనగర్‌లోని డిగ్రీ కళాశాలలో అతిథి లెక్చరర్‌గా పని చేశాను. 2019 ఆగస్టులో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

కుట్టుమిషన్ అందజేత

సుభాష్‌నగర్, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): మేయు సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందచేశారు. నగరానికి చెందిన నిరుపేద మహిళ రాజమణి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుంది. ఈ విషయమై ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్నను సంప్రదించగా ఆమె వంటనే స్పందించి సత్యజిత్ మానసారెడ్డి సహకారంతో రాజమణికి కుట్టుమిషన్ అందచేశారు. ఈ కార్యక్రమంలో చకిలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవితా సమ్మేళనానికి 'ముదుగంటి'కి ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జన సత్తా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ముదుగంటి సుధాకరరెడ్డికి ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరిగే 6వ ప్రపంచ తెలుగు మహాసభలకు రావాల్సిందిగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుత్తి కొండ సుబ్బారావు, పూర్ణచందర్ ఆదివారం ఆహ్వానం పంపించారు. ఈ సభలకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, పలువురు రచయితలు, సాహితీవేత్తలు హాజరౌతున్నారని పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బొమ్మకల్‌రోడ్ పంచముఖ హనుమాన్ ఆలయంలో ఆదివారం పరబ్రహ్మానందగిరి స్వామి నేతృత్వంలో 32వ హనుమద్వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గంప జగన్, విద్యాసాగర్, తోట రాజేందర్, జీఎస్ ఆనంద్, దేవిశెట్టి హనుమాండ్లు, పిట్టల స్వామి, నందం, విశ్వనాథం, రమేశ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చైతన్యపురిలో ఆదివారం రాగంపేట ఆర్యవైశ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి 27 వరకు కరీంనగర్ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే మహాభారత ప్రవచన జ్ఞాన యజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. గర్రెపెల్లి మహేశ్వరశర్మ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 10 నుంచి 12-30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు గర్రెపెల్లి మహేశ్వరశర్మ ప్రవచనం చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నలుమాచు సుదర్శనం, నలుమాచు చంద్రశేఖర్, విశ్వనాథుల రమేశ్, విశ్వనాథుల శ్రీనివాస్, బొడ్ల వేణుగోపాల్, పాత హరిప్రసాద్, రాచర్ల వేంకటేశం, ఎల్లంకి ఆనందం, మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'దళితుల అభ్యున్నతికి వెంకటస్వామి కృషి'



కాకా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి కృషి చేశారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే తన చిరకాల స్వప్నంగా వెంకట స్వామి జీవించారన్నారు. ఆదివారం వెంకట స్వామి వర్ధంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు కాకా చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పులి అంజనేయులుగౌడ్, బొబ్బిలి విక్టర్, వెన్న రాజామల్లయ్య, అజీమ్ మహమ్మద్, వంగల విద్యాసాగర్, కుర్ర పోచయ్య, దన్నుసింగ్, నాగుల సతీష్, మహమ్మద్ చాంద్, వెన్నం రజితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: కాకా సేవలు చిరస్మరణీయమని దళిత సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తాలోగల అంబేడ్కర్ విగ్రహం వద్ద కాకా, పీవీ రావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు నాయకుడు దామెర సత్యం, దళిత నాయకుడు వెన్న రాజమల్లయ్య, నల్లాల కనకరాజు, ఇరుకుల్ల యాదగిరి, తీట్ల ఈశ్వరి, జక్కుల బాబు, అంబేడ్కర్ మిషన్ రాష్ట్ర నాయకులు పాటకుల భూమయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, సారయ్య, దశరథం, రఘుపతి, మహేం దర్, దయాకర్, రమేష్, జీవన్, ప్రభాకర్, సునీత, స్వామి తదితరులు పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంలో వెంకటస్వామి చిత్రపటానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామారావు నివాళు లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొడిశాల పరమేష్, పైడిపల్లి దేవేందర్, గుండ్ల వెంకన్న, రాజేందర్, సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, గోలి కిరణ్, పెద్ది కుమార్, రాజబాబు, కొంరయ్య, రాజయ్య పాల్గొన్నారు.

●గంగాధర: మండలంలో మాల మహానాడు ఆధ్వర్యంలో కాకా వర్ధంతి నిర్వహించారు. గంగాధర ప్రధాన రహదారిపై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తాళ్ల స్వామి, తాళ్లశ్రీనివాస్, తుమ్మల లక్ష్మణ్, బిజ్జిక కొండయ్య, పసుల నరేష్, సమూయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ

(5వ పేజీ తరువాయి)

●గన్నేరువరం: మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం పక్క మండలమైన తిమ్మాపూర్, లేకపోతే కరీంనగర్‌కు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. మండలంలో గన్నేరువరం, ఖాసింపేట, జంగపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా వీటిని పల్లె దవాఖానాలుగా మార్చారు. మండలానికి పీహెచ్‌సీ లేదు. ఉన్న నాలుగు గ్రామాల్లోని సబ్ సెంటర్లలో హెల్త్ అసిస్టెంట్లు లేదు.

● అన్నీ సమస్యలే..

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు తిష్టవేశాయి. భవనం పైపెచ్చులు ఊడి పడుతుండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. స్లాబ్‌పైన ఉన్న పైపులను కోతులు ధ్వంసం చేయడంతో ప్లంబింగ్ సమస్య ఏర్పడింది. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులున్నాయి. భవనం చుట్టూ ప్రహరీ లేదు.

● అందుబాటులో ఉండని సిబ్బంది

వీణవంక: మండలంలోని చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాశ్వత వైద్యాధికారి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురువతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజూ 100 మంది పేషంట్లు ఆసుపత్రికి వస్తుంటారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుత వైద్యుడు డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నాడు. రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని మండలవాసులు కోరుతున్నారు.

ట్రినిటి రామానుజన్ ఒలింపియాడ్ పరీక్షకు స్పందన


ఒలింపియాడ్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ట్రినిటీ జూనియర్ కళాశాల ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన ట్రినిటి రామానుజన్ ఒలింపియాడ్ పరీక్షకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పదో తరగతి విద్యార్థులకు లెవల్-2 పరీక్ష నిర్వహించారు. గతంలో లెవల్-1 పరీక్షను నిర్వహించగా 12,356 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. అందులో 2,368 లెవల్2 పరీక్షకు అర్హత సాధించారు. వారిలో 1889 మంది విద్యార్థులు ఆదివారం నిర్వహించిన పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 30 మందికి నగదు పారితోషికాలు అందిస్తామని, పరీక్షల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన వారికి కళాశాల ఫీజులో వంద శాతం వరకు రాయితీలు అందిస్తామని కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

వివేకానంద జంక్షన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలి

గణేశ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జంక్షన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణిహరిశంకర్‌లకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ జ్యోతినగర్‌లోని శివ థియేటర్ ముందుగల స్వామి వివేకనంద కాంస్య విగ్రహం ముందున్న స్థలాన్ని వివేకానంద జంక్షన్‌గా నామకరణం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా చైర్మన్ చల్ల హరిశంకర్, కన్వీనర్ వొడ్నాల రాజు, యువజన ప్రతినిధులు గుండ్ల శ్రీధర్, రమణ చారీ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి బ్యాడ్మింటన్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి జరుగుతుందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. తన స్వంత నిధులతో క్రీడా దుస్తులను సమకూర్చి క్రీడాకారులకు పంపిణీ చేసి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు గుంటపల్లి స్వామి, రవీందర్‌రెడ్డి, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు సన్మానం

గణేశ్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఎన్నికైన ఆర్.కృష్ణయ్యను ఆదివారం బీసీ భవన్‌లో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూపశ్యాం,బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల ఉమా మహేశ్వర్, బీసీ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పారమిత పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో ఫామ్-జామ్-ఫ్యామిలీ-ఫన్ అనే పేరుతో వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆనందాన్ని కలుగజేస్తాయన్నారు. విద్యార్థులు తమ నిత్య జీవితంలో క్రీడలకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రులు, అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలకు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన కవాతు, కర్రసాము, పిరమిడ్స్, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, వినోద్‌రావు, రాకేష్, ప్రాచీ, హన్మంతరావు, ప్రసాద్, టీఎస్‌వి రమణ, ప్రధానోపాధ్యాయులు కవితా ప్రసాద్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

గణిత సెమినార్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక

భగత్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు కొత్తపల్లి మండలం చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అడిగొప్పుల సదయ్య ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి గణిత దినోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.

వినూత్న బోధనా పద్ధతులు ఉపయోగించి విద్యార్థులలో గణిత సామర్థ్యాలు పెంపొందించే ఉపాధ్యాయులను ఎంపిక చేసి ప్రశంసా పత్రాలను అందించారు. గణిత సెమినార్‌లో ప్రతిభ చాటిన సదయ్యకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నర్సింహారెడ్డి ప్రశంసాపత్రం అందించారు.

'నూతన కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలి'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్మిస్తున్న కళాక్షేత్రానికి గద్దర్ పేరు పెట్టాలని కవులు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గద్దర్ గళం ఆధ్వర్యంలో కవులు, కళాకారుల ఆత్మీయ సమావేశం కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గద్దర్ గళం ఫౌండర్ కొల్లూరి సత్తయ్య మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో గద్దర్ పోషించిన పాత్ర విలువైనదన్నారు. గద్దర్ గళం సంస్థ ఆధ్వర్యంలో 10 జిల్లాల్లో గద్దర్ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వచ్చే నెల 31న గద్దర్ జయంతి రోజు ఆయన విగ్రహాన్ని కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ గద్దర్ పాటలు నేటికీ ప్రజల నోళ్లల్లో సజీవంగా ఉన్నాయన్నారు. గద్దర్‌కు కరీంనగర్ నేలకు విడదీయరాని సంబంధం ఉందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, గద్దర్ గళం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్ మాట్లాడుతూ తెలుగు నేల మీద ఎన్నో ఉద్యమాల్లో గద్దర్ పాటలు పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. బహుజన ఉద్యమ నాయకుడు గజ్జల స్వామి మాట్లాడుతూ కరీంనగర్ నేల నుంచే విప్లవోద్యమానికి గానీ, తెలంగాణ ఉద్యమానికి గానీ సాంస్కృతిక పునాదులు పడ్డాయన్నారు. గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత పౌరసమాజం మీద, ఆమర అభిమానుల మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, అజయ్, మార్వాడి సుదర్శన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు, జాదవ్, జన్నారం శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'


పిల్లలతో కలిసి సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సుభాష్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరింది. ఆదివారం తమ పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. తమ తల్లిదండ్రుల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని పిల్లలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ టీపీసీసీ అధ్యక్షుని హోదాలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. మినిమమ్ పే స్కేలు, జీవిత బీమా, హెల్త్‌కార్డులు, సమగ్ర శిక్ష మహిళ ఉద్యోగులకు 108 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధిహామీ పనులు


పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో మహిళ భరోసా కింద చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. నెల కిందట రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంబరాల్లో భాగంగా మండలంలో అన్ని గ్రామాల్లో మహిళ భరోసా కింద పనులు చేపట్టింది. ఇందులో కోళ్ల ఫారాలు, పశువుల పాక నిర్మాణాలతో పాటు పలు రకాల పనులను ఆయా గ్రామాల్లో అధికారులు ప్రారంభించారు. మండలంలో 126 యూనిట్లు17 గ్రామాల్లో 11లక్షల వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో కోళ్ల ఫారాలు 4 యూనిట్లు, పశువుల పాకలు 50యూనిట్లు మంజూరు కాగా ఆపనులను మార్చి 31లోగా పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో పశువుల పాకలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. సబ్సిడీలో గొర్రెల షెడ్లు, కోళ్ల ఫారంలకు నిధులు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఇందుకు పశువుల షెడ్ మంజూరుకు కనీసం నాలుగు పశువులు కలిగి ఉండి 20గుంటలు భూమి ఉండాలి. గ్రామాల్లో పశువులు పెంపకం చేసుకునే వారికి షెడ్‌ల నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తుందని ఏపీవో శోభారాణి తెలిపారు. రైతులు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య శిబిరాలతో అనారోగ్య సమస్యలు ముందే తెలుసుకొని చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రజల కోసం మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 261 మందికి ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ అనీష్, సర్జికల్ గ్రాస్ట్రో డాక్టర్ దిలీప్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మాదని వీరశేఖర్, తక్కిడి రవీందర్‌రెడ్డి, మాతంగి శంకర్, కిరణ్, మాదని వీరయ్య, గాంకిడి లక్ష్మారెడ్డి, పోలు రమేష్, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, మనోజ్, సంతోష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

గన్నేరువరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్ర, యువచైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్‌పుట్ క్రీడలు ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొనగా కబడ్డీలో గన్నేరువరం టీం, వాలీబాల్‌లో రేపాక టీంలు విజయం సాధించాయి. గెలుపొందిన క్రీడాకారులకు ఖాసింపేట మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు ఏలేటి చంద్రారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువచైతన్య యూత్‌క్లబ్ సభ్యులు అనిల్‌రెడ్డి, పీఈటీలు నరహరి, ప్రశాంత్, రేపాక బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శంకరపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం ప్రభుత్వ పాఠశాల 2005-06 పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం రామస్వామి, పీటీ రాజిరెడ్డి, శ్యాంసుందర్, సుధాకర్, రామచంద్రరెడ్డి, లక్ష్మణరావు, రాజేష్‌కుమార్, పవన్‌కుమార్, లత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్


పెద్ది శివకుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తో కలిసి కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామంలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే నిరుపేదల ప్రజల ఆరోగ్యసంక్షేమం కోసం జయన్న ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను పరామర్శించి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయన్న ఫౌండేషన్ నిర్వాహకుడు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి, కసుబుసుల వెంకన్న, ఎండీ సలీం పాషా, చిన్నల శ్రీకాంత్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● హుజూరాబాద్ మండలంలోని శాలపల్లి-ఇందిరా నగర్ గ్రామానికి శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్, సీపీఐ యువ నాయకుడు కోడిగూటి శారద-ప్రవీణ్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ శాలపల్లి-ఇం దిరానగర్ గ్రామంలో శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామపంచాయతీ ఏర్పడి పదేళ్లు పూర్తయినా పశువైద్యశాల లేదన్నారు. ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులకు రూ. 20 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు పెద్ది శివకుమార్‌ను ఆదివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సన్మానించారు. ఇటీవల పెద్ది శివకుమార్ ఇల్లందకుంట మండల యువజన అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ శివకుమార్‌ను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపాకలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ రూ. 25లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

సైదాపూర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (డీపీఈపీ) ఆవరణలో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బత్తుల లక్ష్మీనారాయణ, మట్టెల రవీందర్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26న ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు హాజరుకావాలని కోరారు.

మినీ క్రిస్మస్ వేడుకలు

జమ్మికుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మారుతి నగర్‌లో గెత్సమే ప్రార్థన మందిరంలో కరుణాపురం పాస్టర్ జోజిపాల్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం నిర్వహించారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇల్లందుల భద్రయ్య, వరికొప్పుల కొండయ్య, రామనాథం, సారయ్య, కుమార్, మొగిలి, మల్లయ్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చొప్పదండి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చొప్పదండిలో 30 మందికి నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ సీఈవో దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు గామా ఫౌండేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కుటుంబాలకు ఆర్థిక భరోసాలో భాగంగా సరుకులను పంపిణీ చేసినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ జోగు పాల్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణహరి, ఎంసీవో ఇప్పనపల్లి తుకారం, కట్ల నాగరాజు, మారంపల్లి నాగభూషణం, అనుమల రాజు, దూస కైలాసపతి, ఎలిగేటి వెంకటేశం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యేసు క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అనురాధ దంపతులు

తిమ్మాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందురూ కులం, మతం, వర్గము అనే భేదాభిప్రాయాలు లేకుండా ఉండాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ సిద్ధాంతం అన్నారు. క్రీస్తు జన్మదినాన్ని, క్రిస్మస్ వేడుకలను క్యాంపు కార్యాలయంలో జరిపించడం సంతోషంగా ఉందన్నా రు. అందరికి మార్గదర్శకంగా ఉండాలనే క్యాంపు కార్యాలయం లో సంక్రాంతి మొదలుకొని క్రిస్మస్ పండుగ వరకు కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. కుల మతాలకు తావు ఇవ్వకుండా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. యేసు క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని, సమాజంలో అసమానతలు, అశాంతికి క్రీస్తు పరిష్కార మార్గం చూపించారని అన్నారు. సమానత్వం, శాంతి స్థాపన కోసం ఏసుక్రీస్తు జీవతాంతం కృషి చేశారని అన్నారు. ఏసు క్రీస్తు మానవాళికి ఇచ్చిన అద్భుత సందేశాలను మననం చేసుకుంటూ ముందుకు సాగడమే క్రిస్మస్ పండుగ పరమార్థమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే సతీమణి అనురాధ, పాస్టర్లు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ విందును ఏర్పాటు చేశారు. పాస్టర్లు రెవ. రెడ్డిమల్ల ప్రసాద్, ప్రిన్స్ వెస్లీ, తిమోతి జయరాజ్, కరీంనగర్ నియోకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణ, సీఎస్ఐ చర్చ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

హుజూరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌ను అవమానిస్తే సహించేది లేదని, దేశ ప్రజలకు బేషరతుగా కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి వాసు డిమాండ్ చేశారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజల ఆరాధ్యుడైన అంబేద్కర్ పేరును పదే పదే అవమానకరంగా అమిత్ షా మాట్లాడారన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు అనుభవిస్తూ ఇలా మాట్లాడడం సరికాదన్నారు. బీజేపీ అధిష్ఠానం అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సహాయం అందజేత

చొప్పదండి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుడు చీకట్ల నర్సయ్య ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులకు 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు ముద్దం మహేష్‌గౌడ్, డైరెక్టర్ సత్తు నర్సయ్య, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, సత్తు తిరుపతి, తదితరులు పాదల్గొన్నారు.

బొడిగ గాలన్నకు నివాళి

సైదాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ భర్త బొడిగ గాలన్న మొదటి వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆదివారం నివాళులర్పించారు. గాలన్న స్వంత గ్రామమైన సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి వొడితల సతీష్‌కుమార్ హాజరయ్యారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాయిశెట్టి చంద్రయ్య, శంకర్ నాయక్, రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెట్ల పూజ

తిమ్మాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరండ్ల గ్రామంలో కన్నె స్వామి తోడెంగ రాజు గృహంలో అయ్యప్ప పూజలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పాలు, పెరుగు, తేనె, నెయ్యితో పాటు పూలు, పండ్ల అభిషేకం, విభూది, కుంకుమ, గంధం అభిషేకం, గంగా జలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పడునెట్టాంబడి పూజ నిర్వహించి అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు కలకుంట్ల శ్రీనివాస్‌చారి, శేషాచారి, శ్రీధర చారీ, గురుస్వాములు మల్లారెడ్డి, గంగారెడ్డి, అంజిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.